క్లుప్తంగా

సర్పంచ్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



తాయారు చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు రూరల్: నిడదవోలు నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధి, విజ్జేశ్వరం సర్పంచ్ తిక్కా శ్రీనివాస్ తల్లి తాయారు ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. వారి కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ శ్రేణులు బుధవారం పరామర్శించారు. తాయారు పెద కార్యం కావడంతో ఆమె చిత్ర పటానికి మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, సుంకవల్లి శ్రీహరి, యాళ్ల రామారావు, పలు పంచాయతీల సర్పంచులు, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు సంతాపం వ్యక్తం చేశారు.

బాక్సింగ్ పోటీల్లో రవికి ద్వితీయ బహుమతి

నిడదవోలు: ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీకాం సెకండియర్ విద్యార్థి ఎం.రవి ద్వితీయ బహుమతి సాధించాడు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని పెనుగొండ ఎస్వీకేపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ఇంటర్ యూనివర్సిటీ బాక్సింగ్ పోటీల్లో రవి ప్రతిభ కనబరిచి ఈ బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా రవిని బుధవారం స్థానిక కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి, అధ్యాపకులు సీహెచ్ సుబ్బారావు, టి. హనుమంతరావు, పీఎస్ఎస్ స్రవంతి, విద్యార్థులు అభినందించారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా రామతులసి



గోపాలపురం: మండల సమాఖ్య అధ్యక్షురాలిగా రాజంపాలెం గ్రామానికి చెందిన కాకర్ల రామతులసి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం మండల సమాఖ్య అధ్యక్ష ఎన్నిక ఇన్‌చార్జి ఎంపీడీవో కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. మండలంలోని 53 గ్రామ సంఘాలకు గానూ 48 గ్రామ సంఘాల వీవోఏలు ఈ ఎన్నికకు హాజరయ్యారు. కాగా వారిలో 43 గ్రామ సంఘాల వీవోఏలు రామ తులసికి మద్దతు తెలపడంతో ఆమెను ఏకగ్రీవంగా మండల సమాఖ్య అధ్యక్షురాలిగా ప్రకటించారు. ఆమెను పలువురు నాయకులు అభినందించారు.

వృద్ధులకు దుప్పట్లు, నిత్యావసరాల అందజేత



వాత్సల్య వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న డీఎస్పీ దేవకుమార్

కొవ్వూరు: చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని నిరాదరణకు గురవుతున్న వృద్ధులకు మానవతా దృక్పథంలో దుప్పట్లు పంపిణీ చేయడం అభినందనీయమని కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ అన్నారు. కొవ్వూరు ప్రెస్ రిపోర్టర్స్ అసోసియేషన్ తరఫున సమకూర్చిన దుప్పట్లు, బియ్యం బస్తా, నిత్యావసర సరకులను డీఎస్పీ చేతుల మీదుగా బుధవారం పట్టణంలోని వాత్సల్య వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అందజేశారు. ఇటీవల మృతి చెందిన ప్రెస్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాపూజీ (బాబ్జీ) జ్ఞాపకార్థం ఈ సాయం చేసినట్టు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నల్లా స్వామినాయుడు తెలిపారు. ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షుడు గెల్లా రాజాబాబు, పోకల రవి, ఆర్యవైశ్య సంఘం నేత మద్దుల సత్యనారాయణ, ప్రెస్‌క్లబ్ గౌరవా ధ్యక్షుడు జీవీవీ సత్యనారాయణ, జర్నలిస్టులు పాల్గొన్నారు.

వరికోత యంత్రం దగ్ధం



కాలిపోతున్న వరికోత యంత్రం

నల్లజర్ల: సుభద్రపాలెం గ్రామంలో వరికోత యంత్రం దగ్ధమైంది. ప్రకాశరావుపాలేనికి చెందిన కలకండ సోమరాజు ఈ వరికోత యంత్రానికి ఓనర్ కమ్ డ్రైవర్. బుధవారం సాయంత్రం సుభద్రపాలెంలో చిల్లా వెంకటేశ్వరరావు అనే రైతు పొలంలో వరి చేను కోస్తుండగా మెషీన్ నుంచి మంటలు చెలరేగాయి. ఈ హఠాత్ పరిణామానికి భయపడిన డ్రైవర్ సోమరాజు మెషీన్ పై నుంచి కిందకు దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. మెషీన్‌లో ఉన్న ధాన్యంతో పాటు కోతకోయాల్సిన చేను మొత్తం దగ్ధమైంది. స్థానికులు వచ్చి మంటలను అదుపు చేశారు. నష్టం వివరాలు తెలియాల్సి ఉంది.

ఖరీఫ్ దిగుబడి అంతంత మాత్రమే..

- పెట్టుబడి మాత్రమే వస్తుందంటున్న రైతులు
- నష్టపోతామంటున్న కౌలుదారులు
- కొవ్వూరు డివిజన్ పరిధిలో 34,625 హెక్టార్లలో వరి సాగు
- ఎకరాకు 30 నుంచి 35 బస్తాల ధాన్యం



కానూరులో పంట కోస్తున్న వరికోత మెషీన్



ఉసులుమర్రులో ధాన్యాన్ని బస్తాలకు పడుతున్న రైతు, కూలీలు

పెరవలి: ఏడాది ఖరీఫ్ దిగుబడులు అంతంతమాత్రంగా ఉన్నాయి. ధాన్యం దిగుబడులను చూసి అన్నదాతలు దిగాలు చెందారు. ఎకరానికి 30 నుంచి 35 బస్తాల ధాన్యం దిగుబడులు మాత్రమే వస్తున్నాయి. పెట్టుబడి ఖర్చులకు సరిపోతున్నాయని రైతులు, నష్టాలు వచ్చాయని కౌలురైతులు పేర్కొంటున్నారు. ఈ ఖరీఫ్‌లో సాగు పెట్టుబడులు పెరిగాయి. గింజలు పాలుపోసుకునే సమయంలో వాతావరణంలో వచ్చిన మార్పుల వలన గింజలు గట్టి పడలేదు. అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాల వల్ల తెగుళ్ల వ్యాప్తి చెందాయి. పై కారణాలన్నీ పంట దిగుబడులపై ప్రభావం చూపాయని రైతులు వివరిస్తున్నారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో 34,625 హెక్టార్ల విస్తీర్ణంలో రైతులు వరి సాగు చేపట్టారు. ఇప్పటి వరకూ 2,980 హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే వరి కోతలు పూర్తయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. కొత్త విత్తనాలు సాగు చేసిన పొలాల్లో ఎకరానికి 25 బస్తాల దిగుబడులు వస్తున్నాయని, అదే స్వర్ణ రకాలు సాగు చేసిన పొలాల్లో మాత్రం ఎకరానికి 30 నుంచి 35 బస్తాల ధాన్యం దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. ఈ దిగుబడుల వల్ల తమకు నష్టం వస్తుందని కౌలు రైతులు వాపోతున్నారు. ఎకరానికి పెట్టుబడి ఖర్చు రూ.22 వేలు అయ్యింది. దిగుబడులు 30 నుంచి 35 బస్తాలు వస్తున్నాయని, కౌలు చెల్లించగా తమకు ఏమీ మిగలడం లేదని విశ్లేషిస్తున్నారు. రెండు పంటలకూ కలిసి ఎకరానికి కౌలు 28 బస్తాలు ఉందని, పండిన పంటలో 14 బస్తాలు కౌలుకి ఇస్తే మిగిలిన 20 బస్తాలు పెట్టుబడులకు సరిపోతుందని కౌలుదారులు పేర్కొంటున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల దిగుబడులు తగ్గాయని రైతులు చెబుతుంటే అధికారులు అధిక ఉష్ణోగ్రతలు, అధిక వర్షాల వలన పంటలపై తెగుళ్ల ఆశించాయని పేర్కొంటున్నారు. కొవ్వూరు డివిజన్ వ్యాప్తంగా ప్రస్తుత ఖరీఫ్‌లో 34,625 హెక్టార్ల విస్తీర్ణంలో వరి సాగు చేపట్టారు. నిడదవోలు నియోజకవర్గంలో మాత్రం 34 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఇప్పటి వరకూ డివిజన్ పరిధిలో 2,980 హెక్టార్లలో మాసూళ్ల పూర్తయ్యాయి.నిడదవోలు నియోజక వర్గంలో మాత్రం 30 శాతం పూర్తయ్యాయి.

రబీ ఆదుకుంటేనే గట్టెక్కుతాం



ఖరీఫ్ పంట నష్టాలు తెచ్చి పెట్టింది. వచ్చిన పంట దిగుబడిలో కౌలు కింద 14 బస్తాలు ఇవ్వాలి. మిగిలింది పెట్టుబడులకు పోతుంది. రబీ పంట ఏమైనా రక్షిస్తే మిగులులోకి వస్తాం. లేకపోతే నష్టాలు తప్పవు.

–గొల్లకోటి వెంకటేశ్వరరావు, కౌలు రైతు, అన్నవరప్పాడు

సరాసరిన 35 బస్తాల దిగుబడి



కొవ్వూరు డివిజన్ పరిధిలో ఖరీఫ్ ధాన్యం దిగుబడులు సరాసరిన 35 బస్తాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు డివిజన్‌లో వరికోతలు 2980 హెక్టార్లలో జరిగాయి. వాతావరణ మార్పులతో వ్యాపించిన తెగుళ్ల వలన అక్కడక్కడా దిగుబడులు తగ్గవచ్చు.

–పి.చంద్రశేఖర్, ఏడీఏ, కొవ్వూరు డివిజన్

నేడు పాలంగిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉండ్రాజవరం: విద్యుత్తు లైన్ల మరమ్మతులల నిమిత్తం పాలంగి సబ్‌స్టేషన్ పరిధిలోని పాలంగి గ్రామానికి గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరాఫరా నిలిపి వేయనున్నట్టు నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.నారాయణ అప్పారావు బుధవారం తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్తపై కేసు

నల్లజర్ల: వివాహమై 21 ఏళ్లయినా మరింత కట్నం కోసం వేధిస్తున్న వ్యక్తిపై భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని అనంతపల్లికి చెందిన బాలనాగ వీర వెంకటలక్ష్మికి కొయ్యలగూడేనికి చెందిన కపిల ప్రవీణ్‌కుమార్‌తో 2003లో వివాహమైంది. అప్పట్లో కట్నం, లాంఛనాలు ముట్టజెప్పారు. ఈ దంపతులకు ఇద్దరు మగ పిల్లలు. కొంతకాలంగా మరింత కట్నం తెమ్మంటూ ప్రవీణ్‌కుమార్ తరచూ భార్యను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ ఏడాది మే నెలలో ప్రవీణ్‌కుమార్ భార్యను పుట్టింటికి పంపేశాడు. పెద్దల సమక్షంలో పలు దఫాలుగా నచ్చజెప్పి పంపారు. ఆయినా మళ్లీ వేధింపులు ప్రారంభించడంతో వెంకటలక్ష్మి బుధవారం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కలెక్టర్ తనిఖీ



నెలటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

చాగల్లు: రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. మండలంలోని నెలటూరు, ఊనగట్ల గ్రామాల్లో ఆమె బుధవారం పర్యటించారు. నెలటూరు రైతు సేవా కేంద్రం వద్ద, ఊనగట్ల సొసైటీ వద్ద గల రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు చేసే విధానాలను, రైతులకు అందుతున్న తక్షణ సేవలను కలెక్టర్ సిబ్బందిని, రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ రైతు నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతు ఖాతాలో సొమ్ము జమ అవుతుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ధాన్యంలో తేమ శాతం తదితర వివరాలు సక్రమంగా నమోదు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా యంత్రాంగం పని చేయాలని ఆమె సూచించారు. తహసీల్దార్ ఎం.మెరికమ్మ, ఏవో కె.వేణుగోపాలకృష్ణ, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రైల్వే శాఖలో ఉద్యోగాలు భర్తీ చేయాలి

స్టేషన్ మాస్టర్‌కు డీవైఎఫ్‌ఐ నాయకుల వినతి



రైల్వే స్టేషన్ మాస్టర్ సత్యనారాయణకు వినతిపత్రం అందిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

నిడదవోలు: రైల్వే శాఖలో రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకుని, రైల్వేలో ఖాళీగా ఉన్న 2.98 లక్షల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు డీవైఎఫ్‌ఐ నాయకులు బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ మాస్టర్ జి.సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీవైఎఫ్‌ఐ జిల్లా కో– కన్వీనర్ గారపాటి ప్రసన్నకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 9.8 లక్షల ఉద్యోగాలను కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేసి యువతకు ఉపాధిని దూరం చేస్తోందన్నారు. రైల్వే శాఖలోని సేఫ్టీ కేటగిరీలో 53,178 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు ఆ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారని గుర్తు చేశారు. ఇలాంటి తరుణంలో రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకుంటున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్‌ఐ) తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ కమిటీ సభ్యులు ముహ్మద్ షాను, జి.కాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్ రాజీనామా చేయాలి

మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవి ప్రకాశ్

కొవ్వూరు: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తక్షణం తన పదవికి రాజీనామా చేయాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యాం రవి ప్రకాశ్ డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ పిఠాపురంలో మీడియాతో మాట్లాడిన విధానం ఆయన బాధ్యతా రాహిత్యానికి నిదర్శనం అన్నారు. హోం మంత్రి వంగలపూడి అనిత దళిత మహిళ అయినందునే చులకన భావంతో మాట్లాడుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల అంశం ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల్లో ఉంటుం దన్నారు. దీనిపై కనీసం అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారని శ్యాం రవిప్రకాశ్ విమర్శించారు. భారత రాజ్యాంగంలోని 164 ఆర్టికల్ ప్రకారం మంత్రులు మాట్లాడే ప్రతి విషయం రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి బాధ్యత అన్నారు. పవన్ కల్యాణ్ తన శాఖ పరిధిని దాటి మాట్లాడడం బాధాకరం అన్నారు. రాష్ట్రంలో దళిత స్త్రీలకు, మైనారిటీలకు రక్షణ లేదని ఆరోపించారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై చంద్రబాబు స్పందించాలని డిమాండ్ చేశారు.

దళితులను అవమానించేలా పవన్ వ్యాఖ్యలు

నల్లజర్ల: హోం మంత్రి అనితపై పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను దళితసేన నాయకుడు జుజ్జవరపు రవిప్రకాశ్ ఖండించారు. నల్లజర్లలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. విషయాలు ఏమైనా ఉంటే అంతర్గతంగా చర్చించుకోవాలే తప్ప ఇలా బహిరంగంగా వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. హోంమంత్రిని అంటే ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబును అన్నట్టే అన్నారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే రాజకీయంలో భాగమే ఇదన్నారు. ఆయనతో పాటు మహిళా నాయకురాలు భేతాళ జయసుధ, అధికార ప్రతినిధి బుల్ల రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్కపాము చంటి, దళితసేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీకాకొల్లు స్టాలిన్, పింగుల ఐదియా, విస్సన్నపల్లి సురేష్ పాల్గొన్నారు.

పంటమార్పిడి విధానం పాటించండి

రైతులకు శాస్త్రవేత్తల పిలుపు

నల్లజర్ల: రైతులు ఏటా ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి విధానాన్ని పాటించాలని వెంకట్రామన్నగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పెదబాబు సూచించారు. మండలంలోని తూర్పు, పడమర చోడవరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పెదబాబు మాట్లాడుతూ ఏటా ఒకేరకం పంట పండిస్తే ఎరువుల వినియోగం పెరుగుతుందని, ఫలితంగా భూ సారం దెబ్బతింటుందన్నారు. దిగుబడులు తగ్గడంతో పాటు సారవంతమైన పంట భూములు చౌడు భూములుగా మారే ముప్పు ఉందన్నారు. పంటమార్పిడి విధానాన్ని అలవరుచుకొని పంట సాగుకు ముందు జీప్సాన్ని వేయాలన్నారు. మరో శాస్త్రవేత్త శేషకిరణ్ తన ప్రసంగంలో వివిధ పంటలపై, తోటలపై ఆశించే కీటక నాశినల గురించి వివరించారు. ఉద్యానశాఖాధికారి బబిత మాట్లాడుతూ పంట నమోదైన జీడిమామిడి రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం ఎకరాకు రూ.1500 చొప్పున చెల్లించాలన్నారు. అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల వల్ల పంట పాడైతే రూ.30 వేల వరకూ పంట నష్టం అందుతుందన్నారు.

మినుము మినీ కిట్ పరిచయం

కార్యక్రమంలో పాల్గొన్న మండల వ్యవసాయాధికారి కమల్‌రాజ్ కొత్త రకం మినుము విత్తనం వీబీఎన్–8ను రైతులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్ర సిబ్బంది సాయి, అనూష రైతులు పాల్గొన్నారు.



తూర్పుచోడవరంలో రైతులకు మినుము మినీ కిట్లు అందజేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



భీమోలులో రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఏవో రాజారావు

పంట సాగు ధ్రువీకరణ పత్రాల అందజేత

గోపాలపురం: మండలంలోని భీమోలు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మండల వ్యవసాయాధికారి బి.రాజారావు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పంట సాగు విస్తీర్ణం వల్ల రైతులు ఎరువులు, పురుగు మందులు, ఇతర వ్యవసాయ పనిముట్లను ప్రభుత్వం ద్వారా పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అన్నెపు వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ గంద్రోతు శ్రీనివాసరావు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలి మండలంలో..

పెరవలి: ఈ నెలాఖరు నాటికి సార్వా మాసూళ్లు ముమ్మరం అవుతాయని మండల వ్యవసాయాధికారి ఎ. మేరీ కిరణ్ అన్నారు. మండలంలోని ఖండవల్లి, కొత్తపల్లి అగ్రహారం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దాళ్వా పంటకు రైతులు సన్నద్ధం కావాలని ఆమె ఈ సందర్భంగా సూచించారు. దాళ్వాలో ఏయే వరి విత్తనాలు నాటుకోవాలి? అధిక దిగబడి వచ్చే వరి వంగడాలు ఏవి అని విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ మాచరమ్మ, రైతులు పాల్గొన్నారు.

దొమ్మేరులో వరి పంటకోత ప్రయోగం



దొమ్మేరులో పంట కోత నమూనాలు సేకరిస్తున్న అధికారులు

కొవ్వూరు: దొమ్మేరు గ్రామంలోని కేవీకే రంగారావు అనే రైతు వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం వరి పంట కోత ప్రయోగం నిర్వహించారు. ఇక్కడి వరి పొలంలోని 5/5 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సంపత్ స్వర్ణ వరి వంగడం పంట నమునా సేకరించారు.19.550 కిలో గ్రాముల దిగుబడి వచ్చిందని నిర్ధారించారు. దీని ప్రకారం ఎకరాకు 42 బస్తాల దిగుబడి సాధించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. డిప్యూటీ స్టాటిటిక్స్ ఆఫీసర్ పి.సోమరాజు, ఏఎస్‌వో బి.నీలిమ, మండల వ్యవసాయ అధికారి ఎ.గంగాధర్, కలగర వెంకటకృష్ణ, రైతు కేవీకే రంగారావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్నకు పంచామృతాభిషేకాలు



వేగేశ్వరపురంలో అయ్యప్ప పూజ చేస్తున్న మాలధారులు

తాళ్లపూడి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని వేగేశ్వరపురం గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం స్వామివారికి పంచామృతాభిషేకాలు, అయ్యప్ప స్వామికి పూజలు నిర్వహించారు. గ్రామా నికి చెందిన అయ్యప్ప మాలధారులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెరవలి సత్య ప్రసాద్, సాయి తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేకం చేశారు. స్వామివారిని పుష్పా లతో అలంకరించారు. కై గాల కృష్ణబాబు కుటుంబ సభ్యులు స్వాములకు అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వామి రామిరెడ్డి, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు. అలాగే తాళ్లపూడిలోని శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప పీఠంలో అయ్యప్పస్వామికి అభిషేకాలు, హోమాలు, పూజలు నిర్వహించారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటుకు భారీగా దరఖాస్తులు



నిడదవోలు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేస్తున్న పట్టభద్రులు

నిడదవోలు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల నమోదు కోసం గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. దరఖాస్తుల స్వీకరణకు బుధవారం చివరి రోజు కావడంతో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం కిక్కిరిసిపోయింది. సంబంధిత సిబ్బంది దరఖాస్తులను తీసుకుని వాటిని పరిశీలించిన తర్వాత అన్ని కరెక్టుగా ఉంటే తహసీల్దారు కార్యాలయం ముద్ర వేసి రసీదులు అందజేశారు. దరఖాస్తుతో పాటు డిగ్రీ ప్రొవిజినల్, ఆధార్, ఓటరు కార్డు జిరాక్స్‌లు జత చేయవలసి ఉండడంతో జిరాక్స్ సెంటర్లు కలకళలాడారు. ఓటు హక్కు కోసం నిడదవోలు నియోజకవర్గంలో 9,043 మంది పట్టభద్రులు దరఖాస్తు చేసుకున్నట్లు స్థానిక తహసీల్దార్ నాగరాజు నాయక్ తెలిపారు. వారిలో నిడదవోలు పట్టణం, మండల పరిధిలో 4,051 మంది, ఉండ్రాజవరం మండలంలో 2,892 మంది, పెరవలి మండలంలో 2,100 మంది దరఖాస్తులు ఉన్నారు.

నల్లజర్లా.. మేం రాం బాబోయ్

- బదిలీ చేయించుకుని వెళ్లిపోతున్న అధికారులు
- ఎంపీడీవో, తహసీల్దార్, ఎస్సై, సీఐ, ట్రాన్స్‌కో ఏఈ పోస్టుల ఖాళీ
- కూటమి నేతల గ్రూపు ఆధిపత్యాలే కారణమా?



ఖాళీగా ఉన్న నల్లజర్ల ఎంపీడీఓ సీటు

నల్లజర్ల: మండలంలో పని చేయడానికి వివిధ శాఖల అధికారులు వెనకడుగు వేస్తున్నారు. ఇక్కడ పని చేయడం కత్తిమీద సాములా మారందని భావిస్తున్నారు. ధైర్యం చేసి వచ్చిన అధికారులు కూడా నెల తిరిగే లోగానే ఏదో ఒక వంకతో ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. ఎన్నికల విధుల నిర్వర్తించడానికి వచ్చిన ఎంపీడీఓ ఎన్నికల తర్వాత కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు కూడా లేరు. ఎవరూ రావడానికి కూడా సాహసించడం లేదు. బదిలీ అయిన ఎంపీడీవో స్థానంలో ఇంతవరకూ మరో అధికారి ఇక్కడకు రాలేదు. అలాగే బదిలీపై వచ్చిన తహసీల్దార్ తొలుత కొనసాగుదామనే అనుకున్నారు. ఏమైందో ఏమోగాని ఆయన కూడా సెలవు పెట్టి వెళ్లిపోయారు. గత నెలా 15 రోజులుగా తహసీల్దార్ ఆఫీసు ఇన్‌చార్జ్‌తోనే నడుస్తోంది. నల్లజర్ల పోలీస్ స్టేషన్‌కు వచ్చిన నెల రోజులకే ఎస్‌ఐ వెళ్లిపోయారు. రెండు నెలలకు నల్లజర్ల సీఐ కూడా సెలవుపై వెళ్లిపోయారు. విద్యుత్ శాఖ మండలంలో ఏఈ లేరు. కూటమి ప్రభుత్వ ప్రతినిధులు ఇక్కడ రెండు వర్గాలుగా విడిపోయి తమ ప్రతాపాన్ని అధికారులపై చూపిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. వారిలో ఎవరి మాటకు గౌరవం ఇచ్చి పని చేయాలో, ఎవరి పని చేయకూడదో అధికారులు నిర్ణయించుకోలేక పోతున్నారు. ఎవరిని ఔననాలో, ఎవరిని కాదనాలో తెలియక వారు ఇరుకున పడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో సైతం పనిచేద్దామని వచ్చిన అధికారులు కూడా ఏదో సాకు చెప్పి వెనుతిరిగి వెళ్లిపోతున్నారు.

సకాలంలో పనులు జరగక..

ఈ క్రమంలో మండలంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సకాలంలో పనులు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాలన్నీ ప్రజాప్రతినిధులకు తెలియదా? తెలిసే జరుగుతుందా? అన్న సందేహాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. నల్లజర్ల జిల్లాకు శివారు మండలం కావడంతో ఇక్కడ ఇసుక మాఫియా, మట్టి మాఫియా, డ్రగ్స్ మాఫియా, బియ్యం మాఫియా, లిక్కర్ మాఫియా, పేకాట మాఫియాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. వాటిపై అధికారులు జరుపుతున్న దాడుల్లో అధికార పార్టీ వారు కూడా పట్టుబడుతున్నారు. ఇలాంటి సందర్భంలో కూటమిలోని ఒక వర్గం పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేయమని, మాఫీ చేయమని మరో వర్గం వత్తిడి తెస్తున్నట్టు సమాచారం. ఏం చేయాలో పాలుపోని స్థితిలో అధికారులు నలిగిపోతున్నారు. అందుకే 'నల్లజర్లా మేం రాంబాబోయ్' అంటూ అధికారులు ఇక్కడకు వచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి తప్పిదాలను ప్రజాప్రతినిధులు ఎప్పుడు సరిదిద్దుకుంటారా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల్లో కూటమి పార్టీలను నెగ్గించి తప్పు చేశామా? అని కూడా మదన పడుతున్నారు.